క్లుప్తంగా

ఘనంగా జయలక్ష్మి మాత ఆరాధనోత్సవం



అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న సభ్యులు

అద్దంకి: రాజరాజేశ్వరీ స్వరూప శ్రీ జయలక్ష్మి మాత ఆరాధనోత్సవం పట్టణంలోని ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా దత్త హ్యుమన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శ్రీవాసవి క్యాటరర్స్ సౌజన్యంతో ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వలంటీర్లు, మాతృమండలి సభ్యులు, ట్రస్టీలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న కర్లపూడి వంశీయుల కులదేవర శ్రీ చింతామణి రేణుకమ్మ తల్లి ఆలయ 9 వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.రాష్ట్రంలోని నలుమూలల ఉన్న కర్లపూడి వంశీయులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి విశేషపూజలు, అర్చనలు చేశారు. కర్లపూడి వంశీయుల ఆడపడుచులు అమ్మవారికి పాలపొంగళ్లు సమర్పించి చీర,సారెతో తమ మొక్కులు చెల్లించుకున్నారు.

కబడ్డీ శిక్షణ శిబిరం పరిశీలన



వేసవి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి

చినగంజాం: కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం ద్వారా యువ క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి శాఖాధికారి కె. పాల్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. యువక్రీడాకారుల శిక్షణను పరిశీలించి వారిలో ఆయన ఉత్సాహాన్ని రేకెత్తించారు. వేసవి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఏప్రిల్ 20 వతేదీ నుంచి మే 31 వరకు నిర్వహించనున్నట్లు బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు, కోచ్ యం. గిరిబాబు వివరించారు. జిల్లా ఖోఖో కోచ్ పవన్, వాలీబాల్ కోచ్ రాధాకృష్ణ, హాకీ కోచ్ వి. వెంకటయ్య పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం పునర్వసు నక్షత్రం షష్ఠి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్ర ప్రాశస్త్యం ఉన్న శనివారం ఆంజనేయ సామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తేకోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీసువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఇవి ఉంటే ఎండల్

ఎండలు మండిపోతున్నాయి..
వేసవిలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. దీంతో రోడ్లపై ప్రయాణించే పాదచారులు వేసవి తాపాన్ని నిరోధించేందుకు చల్లని పానీయాలతో పాటు తాటి ముంజలు తింటూ ఉపశమనం పొందుతున్నారు. పేద, మధ్య తరగతివారు మట్టి కుండలు కొనుగోలు చేసి చల్లని నీరు తాగుతున్నారు.

- జాతీయ రహదారిపై తాటి ముంజల వ్యాపారం
- 100 కుటుంబాలకు ఉపాధి
- పెరిగిన మట్టి కుండల కొనుగోలు



అద్దంకిలో మట్టికుండలు విక్రయిస్తున్న వ్యాపారి

జె.పంగులూరు, అద్దంకి: వేసవి తాపాన్ని తీర్చి.. శరీరానికి చలువ చేసే తాటికాయల వ్యాపారం జోరందుకుంది. తమకు సంక్రమించిన ఈ వృత్తిని నమ్ముకుని పంగులూరు, కొరిశపాడు మండలాల పరిధిలోని జాతీయ రహదారి వెంట పలువురు అమ్మకాలు చేస్తున్నారు. బొల్లాపల్లి టోల్ ప్లాజా నుంచి మేదరమెట్ల వరకు సుమారు 45 నుంచి 55 కుటుంబాలు వేసవిలో ఇదే వృత్తిగా ఉపాధి పొందుతున్నాయి. ఉదయం 6 గంటలు మొదలు.. సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటున్నారు. హైవే వెంట వేల సంఖ్యల్లో తాటి చెట్లు ఉండటంతో సులభంగా సేకరిస్తున్నారు. పంగులూరు మండలంలోని కల్లంవారిపాలెం, పంగులూరు, కోటపాడు, కొండమూరు తదితర గ్రామాల నుంచి ఆటోల ద్వారా తరలిస్తున్నారు.

నిత్యం ప్రాణాలతో చెలగాటం

తాటి ముంజలు వ్యాపారంలో కూడా వ్యాపారులు నిత్యం ప్రాణాలతో చెగాటం ఆడతారు. వేకువ జామునే లేచి తాటి ముంజలు కొట్టటానికి చెట్టు ఎక్కి తాటికాయలు కోస్తారు. ఈ చెట్టు మీద నుంచి కాయలు కోసేటప్పుడు కాలు జారి కింద పడితే ప్రాణాలు పోతాయి. ఇలా పలువురు కొల్పోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కల్లంవారిపాలెం గ్రామానికి చెందిన పత్తిపాటి మరియదాసు మాట్లాడుతూ 'నాకు సెంటు పొలం లేదు. నాకు ఆటో ఉంది. బాడుగలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. రెండు సంవత్సరాల నుంచి తాటిచెట్టుల వద్ద తాటికాయలు కొట్టి ఆటోలో వేసుకొని జాతీయ రహదారిపక్క ఆపి ఆమ్ము కుంటున్నాం. ఒక్కో తాటికాయ రూ. 20 పడుతుంది. రోజుకు 100 నుంచి 120 కాయల వరకు అమ్ముతాము. చెట్టు యజమానికి కూడా డబ్బులు ఇవ్వాలి. ఈ వ్యాపారం రెండు నెలలు వరకు ఉంటుంది' అని తెలిపాడు.



హైవే పై తాటిముంజలు ఆరగిస్తున్న వాహనచోదకులు



తాటి ముంజలు అమ్ముతున్న యువకుడు

ఒక్కో కుండ ధర రూ.200 నుంచి 300 పైనే..

అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రోజుకు 1000 కుండలకు పైగా విక్రయాలు జరుగుతున్నాయి. ఫ్రిజ్ నీరు ఆరోగ్యానికి మంచిది కాదు అని వైద్యులు చెబుతుండటంతో అంతా మట్టికుండల వైపు నడుస్తున్నారు. నియోజకవర్గంలోని మేదరమెట్ల ఇతర గ్రామాల్లో తయారు చేసిన యర్ర మట్టి కుండలు ఒంగోలుతో పాటు, ఇతర పట్టణాలకు ఎగుమతి అవుతున్నాయి. వాటి సైజులను బట్టి రూ. 200 నుంచి రూ. 300 వరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలోని భవానీ సెంటరు, రామ్‌నగర్ సెంటరు, పోతురాజు గండి సెంటరు తదితర ప్రాంతాల్లో కుండలను జోరుగా విక్రయిస్తున్నారు. ప్రతి రోజూ 100కు పైగా కుండల విక్రయాలు జరుగుతున్నాయి. ఫ్రిజ్‌లో పెట్టిన నీరు, ఆహార పదార్థాలను తినడం వల్ల మనుషులకు ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని.. మట్టి కుండలో నీరు సహజంగా ఉంటుందని వైద్యులు కూడా చెబుతున్నారు.

మురుగు.. దుర్గంధం



చిన అంబడిపూడి గ్రామంలో మురుగు కాలువల్లో నిలిచిన వ్యర్థాల కవర్లు



కాలువ దుస్థితి..

బల్లికురవ: మురుగు కాలువల్లో వ్యర్థాలు తొలగించి నెలరోజులు అవుతున్నా.. శుభ్రం చేయడానికి పాలకులు, అధికారులకు తీరిక లేకుండా పోతోంది. ఫలితంగా వ్యర్థాల కుప్పలతో దుర్గంధంతోపాటు ఈదురు గాలుల ప్రభావానికి వ్యర్థాల కవర్లు ఇళ్లలోకి కొట్టుకొస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని పెద అంబడిపూడి పంచాయతీలోని చిన అంబడిపూడి బీసీ కాలనీలో ఇటీవల మురుగు కాలువలోని వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో తీయించి రోడ్డు మార్జిన్ కాలువ పక్కన పడవేశారు. ఈ వ్యర్థాల కుప్పలను గ్రామానికి దూరంగా తరలించాల్సి ఉంది. అయితే జరుగుతున్న జాప్యం వల్ల ఇబ్బందులు తప్పటంలేదు.

హక్కుల కోసం పనిచేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట వాహిని

చీరాల రూరల్: కార్మిక హక్కుల సాధన కోసం కార్మిక సంఘాలు విధిగా పనిచేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకట వాహిని అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు అంతర్జాతీయ కార్మిక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని రామకృష్ణాపురం పంచాయితీలోగల ఏబీసీ ప్యాషన్స్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్య అతిథిగా న్యాయమూర్తి వెంకట వాహిని పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్మిలంతా మేనెల 1వ తేదీన కార్మిక దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. ప్రతి కార్మికునికి తాను చేసిన పనిదినాలకు గాను సమాన వేతనాన్ని యాజమాన్యాలు చెల్లించాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొరవ రమేష్‌బాబు, న్యాయవాదులు ఎ. రామకృష్ణారెడ్డి, మహిళా ప్రతినిధి యు. స్నేహ, ఏబీపీ ఫ్యాషన్స్ ప్రతినిధి ఎ. పద్మావతి, పీఎల్‌వీ ఎస్‌డీ మతిన్, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

అద్దంకి రూరల్: బైకు అదుపుతప్పి కిందపడి యువకుడికి గాయాలైన సంఘటన అద్దంకి మండలంలో చోటుచేసుకుంది. పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన అయ్యప్ప శుక్రవారం సాయంత్రం బైక్‌మీద అద్దంకి వస్తున్నాడు. ఈక్రమంలో మండలంలోని జార్లపాలెం గ్రామ సమీపంలోని చప్టా వద్దకు రాగానే బైకు అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రగాయాలైన యువకుడిని స్థానికులు ఆటోలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

మోదీ సభతో ప్రయాణికుల అవస్థలు

అద్దంకి రూరల్: అమరావతి లోని ప్రధాని మోదీ సభకు టీడీపీ నాయకులు భారీగా జనాన్ని సమీకరించి తరలించారు. దీనిలో భాగంగా అద్దంకి డిపో నుంచి 26 బస్సులు పంపినట్లు అధికారులు తెలిపారు. బస్సులు లేకపోవటంతో బస్టాండ్‌లో గంటల తరబడి వేచి ఉన్నారు. కొందరు చేసేదిలేక ప్రమాదకరమని తెలిసిన ఆటోలను ఆశ్రయించారు.

నేలకొరిగిన బొప్పాయి తోట

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలంలో శుక్రవారం వేకువజామున కురిసిన ఈదురు గాలులతో కురిసి వర్షానికి మండలంలోని పాతమాగులూరు, లక్ష్మీపురం, మిన్నెకల్లు, చవిటిపాలెం, గ్రామాల్లో బొప్పాయతోటలు నేలకొరిగాయి. పంట నష్టపోయిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకో

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

చీరాల టౌన్: పశుపోషకులు తమ జీవాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాడి పరిశ్రమలో అభివృద్ధి సాధించాలని పశువైద్యురాలు పావని సూచించారు. మంగళవారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 53 గేదెలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ దాణా పంపిణీ చేశారు. వైద్యురాలు పావని మాట్లాడుతూ పశుపోషకుల సంక్షేమం, పశువులు ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. పశుపోషకులు యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటుగా పాల ఉత్పత్తి పెరిగేలా పోషక విలువలు కలిగిన దాణాలను పశువులకు అందించాలన్నారు. సీజనల్‌వ్యాదులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో ఉన్నత భవిత



కారంచేడులో మైక్ ప్రచారం చేస్తున్న హెచ్‌ఎం పావులూరి శ్రీనివాసరావు

కారంచేడు: మీ బిడ్డల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. వేసవి సెలవుల్లో గ్రామంలోని విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా గ్రామంలో ఉపాధ్యాయులు మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. గ్రామంలో నూతనంగా ఈ ఏడాది యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు, పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న యూపీ పాఠశాలను మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేస్తున్నారని, మీ బిడ్డలను ఆయా తరగతులను బట్టి ప్రభుత్వ మోడల్ స్కూల్ లేదా, ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ప్రభుత్వం మీ బిడ్డల బంగారు భవిష్యత్తుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, పాఠ్యపుస్తకాలు, యూనీఫారం, బూట్లు, సాక్సు, రాత పుస్తకాలు వంటివి సమకూరుస్తున్నారన్నారు. కుంకలమర్రు మొయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



చిన్నమల్లవరం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

జె.పంగులూరు: గత కొన్ని సంవత్సరాలుగా ఓవోల్టేజ్ సమస్యతో సతమతమవుతున్న చిన్నమల్లవం రోడ్డులోని పంగులూరు గ్రామ ప్రజల సమస్య పరిష్కారం అయింది. విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు ఆదేశాల మేరకు గతంలో ఉన్న 60 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో శుక్రవారం 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంత విద్యుత్ అవసరాలు దృష్టిలో ఉంచుకొని, 5 వేల జనాభ పథకం ద్వారా మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న యూటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు

ఇంకొల్లు(చినగంజాం): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి పదో తరగతిలో మంచి మార్కులు సాధించటం అభినందనీయమని ఇంకొల్లు మండల విద్యాశాఖాధికారి ఏ. శ్రీనివాసరావు కొనియాడారు. యూటీఎఫ్ ఇంకొల్లు శాఖ ఆధ్వర్యంలో ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన సభకు మండల శాఖ అధ్యక్షుడు పేర్ని సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా యూటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు భవిష్యత్‌లో మంచి మార్కులు సాధించి పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన దాసరి నాగపద్మజ(గంగవరం), ద్వితీయ స్థానం సాధించిన దొడ్డి అశ్విని(పావులూరు), తృతీయ స్థానం సాధించిన గట్టుపల్లి నిషికాంత్ (ఇంకొల్లు)లతో పాటు పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారిని యూటీఎఫ్ శాఖ తరపున బహుమతులు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు చిలుకూరి హనుమంతరావు విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు యు. చెంచయ్య, శివరామకృష్ణప్రసాద్, శ్రీమన్నారాయణ, హెచ్‌ఎం టి. ఆదినారాయణ, యం. సత్యనారాయణ, నాగేశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీస్తు ప్రవచనాలు అనుసరణీయం



దేవుని వాక్య సందేశం అందిస్తున్న అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ జాన్‌వెస్లీ

చీరాల రూరల్: క్రీస్తు ప్రవచనాలు ప్రపంచ మానవాళికి అనుసరణీయమని అంతర్జాతీయ సువార్తికులు బ్రదర్ డాక్టర్ జాన్‌వెస్లీ అన్నారు. స్థానిక ఉజిలిపేటలోని శీలం ఎలీషా ఆధ్వర్యంలో క్రీస్తు రక్షణ ఉజ్జీవ సభను గురువారం రాత్రి నిర్వహించారు. డాక్టర్ జాన్‌వెస్లీ దేవుని వాక్య సందేశం అందించారు. రానున్నవి చాలా చెడ్డ దినాలని ప్రకృతి ప్రకోపించడంతో సునామీలు, భూకంపాలు రావడం, రాజ్యం మీదికి రాజ్యం.. దేశాలు మీదకి దేశాలు దండెత్తుకోవడం జరుగుతున్నాయని, తద్వారా యుద్ధాలు జరిగి లక్షలకొలది జనాంగం మృత్యువాత పడుతున్నారని చెప్పారు. ప్రభువైన ఏసుక్రీస్తును తెలుసుకోవడమంటే సత్యాన్ని, మార్గాన్ని తెలుసుకోవడమేనని చెప్పారు. ఇప్పటి వరకు తాను 105 దేశాలలో పర్యటించి దేవుని సువార్తను ప్రకటించినట్లు చెప్పారు. క్రీస్తు రాకడ అతి సమీపంలో ఉన్నదని ప్రతి ఒక్కరూ మారుమనస్సుతో రక్షణ పొందాలని సూచించారు. శీలం ఎలీషా మాట్లాడుతూ తాను ఆర్టీసీలో ఉద్యోగ విరమణ పొందానని.. వ్యయ ప్రయాసలకోర్చి క్రీస్తు సువార్తను అందరికి అందించాలనే తలంపుతో క్రీస్తు రక్షణ ఉజ్జీవ సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వేల సంఖ్యలో హాజరైన విశ్వాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్, వాహనాల పార్కింగ్ మంచినీటి సౌకర్యాన్ని అందించారు.

మార్గనిర్దేశకుడు దాచూరి రామిరెడ్డి



పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎందరో ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశకులుగా నిలిచి ఉపాధ్యాయ ఉద్యమాన్ని శిఖర స్థాయికి చేర్చిన వ్యక్తి దాచూరి రామిరెడ్డి అని పలువురు వక్తలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చీరాల ప్రాంతీయ మండల కేంద్రంలో యూటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు దాచూరి రామిరెడ్డి 9వ వర్ధంతి సభను శుక్రవారం చీరాల మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సహాధ్యక్షులు బి.భిక్షాలుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయ ఉద్యమాన్ని శిఖర స్థాయికి చేర్చి ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న అనేక ఫలాలు వారి ఉద్యమ కీర్తికి నిదర్శనమని తెలిపారు. దాచూరి రామిరెడ్డి చేసిన సేవలను గురించి పలువురు కొనియాడారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.పాపారావు, జిల్లా కార్యదర్శి సురేష్, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సురేష్, సీనియర్ నాయకులు గవిని నాగేశ్వరరావు, కె.వీ రాంజనేయులు, సూరిబాబు, ఎయిడెడ్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చినగంజాం:కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రుహాన్సీ

కిశోర బాలికల వికాసమే లక్ష్యం

కారంచేడు: గ్రామాల్లోని టీనేజ్ బాలికలు (కిశోర బాలికలు) వికాసం కోసం ప్రభుత్వం నుంచి వారికి ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ కారంచేడు సెక్టార్ సూపర్‌వైజర్ హిమబిందు అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రమైన కారంచేడు గ్రామ సచివాలయ భవనంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడారు. యుక్త వయస్సులో బాలికలకు అవసరమైన ఆహారం, ఆరోగ్య నియమాలతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, బాల్య వివాహాలు, వాటి వలన కలిగే నష్టాలు కూడా తెలియజేస్తామన్నారు. మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు వారంలో రెండు రోజులు మంగళవారం, శుక్రవారం తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామంలోని కిశోర బాలికలు ఈ కార్యక్రమానికి హాజరై శిక్షణ పొందాలన్నారు. ఏఎన్‌ఎం, ఆశ, వీఓఏలు సభ్యులుగా ఉంటారన్నారు. కార్యదర్శి రమేష్, గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.


వేటపాలెం: కౌమార బాలికలు ఆరోగ్య వంతంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎస్. పుష్పవల్లి పేర్కొన్నారు. స్థానిక ఓఆర్ఎస్ స్కూల్‌లో కిశోరి వికాశం కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కౌమార బాలికలకు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. వారంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమాలు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో నిర్వహిస్తామని తెలిపారు. బాలికలకు విద్యా ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పోష్టికాహారం, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్య వివాహల నిషేధ చట్ట, ఆత్మరక్షణ, యోగ, జీవనోపాధి అవకాశాలు, వంటి అంశాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యకర్తలు వి. సుప్రభ, డి. బుల్లెమ్మాయి, జి. అన్న పూర్ణ, పి. నాగేశ్వరి కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

జె.పంగులూరు: కిశోర బాలికలు చదువుతోపాటు ఆరోగ్యం వైపు కూడా దృష్టి పెట్టాలని ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్. పద్మజ అన్నారు. శుక్రవారం ముప్పవరం గ్రామంలో కిశోర బాలికల అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ బాలికలు వయస్సుతో పాటు చదువు, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌమార బాలికల సాధికారతవైపు పయనం అనే ఆంశంపై అవగాహన కలిగించారు. ఏఎన్‌ఎం శేషకుమారి, అంగన్‌వాడీలు ఐ. శ్రీలక్ష్మి, పి. ప్రసన్న కుమారి, బి. శ్యామల, పి. సుధారాణి, ఆశాలు ఏసమ్మ, వెంకాయమ్మ పాల్గొన్నారు.



వేటపాలెం: అవగాహన కల్పిస్తున్న సుప్రభ

చినగంజాం: కిశోర్ బాలికలు ప్రస్తుత సమాజంలోని వ్యవస్థల తీరు పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సీడీపీఓ టి. రుహాన్సీ అన్నారు. శుక్రవారం ఇంకొల్లు అంగన్ వాడీ ప్రాజెక్ట్ పరిధిలోని సంతరావూరులో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కిశోర్ బాలికలను పరిచయం చేసుకొని వారి లక్ష్యాలను తెలుసుకున్నారు. యూట్యూబ్ ద్వారా లింక షేర్ చేసి శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. సెక్టార్ సూపర్ వైజర్‌లు ఉష, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.



ముప్పవరంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



కారంచేడు: కిశోర బాలికల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ హిమబిందు